# స్వచ్ఛమైన ధర్మం

మూలరచయిత

**డాక్టర్ ఎ. బి. ఫిలిప్స్**

الدين الصحيح - تلغو



# స్వచ్ఛమైన ధర్మం

మూలరచయిత

**డాక్టర్ ఎ. బి. ఫిలిప్స్**

అనువాదం

ముహమ్మద్ కరీముల్లాహ్
teluguwebmaster@gmail.com

Copyright © 1428 H., 2007 CE

This book is copyrighted. Any or all parts of this book may be used in any means as
long as the information used is not in any way quoted out of context.

We would like to express our sincere appreciation to those who contri buted to the publication of this book. May Allah reward them for their efforts.

Original Book: The True Religion, Written by Dr A.B.Phillips in English & published by Rabwa Islamic Propogation Office, Riyadh.

If you have any corrections, comments, or questions about this publica tion, please feel free to contact us at:

**telugu@islamhouse.com OR teluguwebmaster@gmail.com**

1428 H
[434]

Published by:

The Islamic Propagation Office in Rabwah
Tel. +4454900 □ 4916065 Ext. 26 □ 27
Email: telugu@islamhouse.com
**www.islamhouse.com**

# విషయసూచిక


1. ఏది స్వచ్ఛమైన దైవధర్మం? 05

2. ధర్మం పేరు 09

3. సృష్టికర్త మరియు సృష్టి 14

4. కలుషిత ధర్మాల సందేశం 21

5. దైవధర్మపు సార్వజనికత 25

6. సృష్టికర్తను గుర్తించటం 28

7. సృష్టికర్త సంకేతాలు 31

8. ముగింపు 36

# 1. ఏది స్వచ్ఛమైన దైవధర్మం ?

ప్రతి మానవుడు తాను జన్మించబోయే స్థితిగతులను, తన ఇష్టానుసారం ఎన్నుకోలేడు. ఈ ప్రపంచంలో జన్మించిన క్షణం నుండే కుటుంబమతం లేదా దేశ సిద్ధాంతాలు అతడి పై బలవంతంగా రుద్దడం మొదలవుతుంది. యౌవనంలో అడుగు పెట్టే నాటికి, కేవలం అతడి సమాజపు విశ్వాసాలు మాత్రమే ప్రజలందరూ అనుసరించదగిన సరైన విశ్వాసాలని మనస్సులో నాటుకునే విధంగా, మాటిమాటికి నూరిపోస్తారు. కాని కొందరు సంపూర్ణమైన సహజ వికాసం పొంది (వివేకంతో బుద్ధిగా ఆలోచించి) మరియు ఇతర మతాల విశ్వాసపద్ధతులు (సామాజిక వ్యవస్థ) వారు ముందుకు రావటం వలన, స్వయంగా తమ స్వంత మతవిశ్వాసంలోని ప్రామాణికతను ప్రశ్నించటం ప్రారంభిస్తారు. అయితే ప్రతి ఒక్క మతము, కులం, తెగ, తత్వము, సిద్ధాంతము కేవలం తమది మాత్రమే మానవులు అనుసరించదగిన సరైన మార్గమని చేసే వాదనలను చూసి, సత్యాన్వేషకులు తరచుగా అయోమయ స్థితికి చేరుకుంటారు. నిజంగా అవన్నీ ప్రజలను మంచి పనులు చేయమనే ప్రోత్సహిస్తుంటాయి. కనుక, వాటిలో

ఏది స్వచ్ఛమైనది(సరైనది)? ఇంకా వాటిలో ప్రతిదీ ఇతరులను అసత్య మార్గాలుగా (కలుషితమైనవిగా) వాదిస్తున్నందు వలన, అవన్నీ ఏకకాలంలో స్వచ్ఛమైనవి, సత్యమైనవి కాజాలవు. ఇటువంటి గందరగోళ స్థితిలో సత్యాన్వేషకులు ఎలా స్వచ్ఛమైన మరియు సరైన మార్గాన్ని ఎన్నుకోగలరు?

ఈ క్లిష్టమైన నిర్ణయానికి అవసరమయ్యే ఆలోచనల్ని మరియు తెలివితేటల్ని సృష్టికర్త మానవులందరికీ ప్రసాదించెను. ప్రతి మనిషి, తన జీవితంలో తీసుకోవలసిన అత్యంత ముఖ్యమైన నిర్ణయమిది. దీని మీదే పూర్తి భవిష్యత్తు ఆధారపడి ఉన్నది. కాబట్టి, ప్రతి ఒక్కరూ తమ ముందున్న సాక్ష్యాధారాల్ని క్షుణ్ణంగా, నిజాయితీగా పరిశీలించి, ఇంకా వేరే సాక్ష్యాధారాలు ముందుకు వచ్చేవరకు నిజమైనదీ/స్వచ్ఛమైనదీ అని ఋజువైన ధర్మాన్నే ఎన్నుకోవలెను.

ఇతర అన్ని ధర్మాల మరియు తత్వజ్ఞానముల వలె, ఇస్లాం కూడా కేవలం తనది మాత్రమే 'సర్వలోక సృష్టికర్త అంగీకరించే సత్యమైన, స్వచ్ఛమైన, ప్రత్యామ్నాయం లేని ఏకైక దైవమార్గం' అని ప్రకటిస్తున్నది. ఈ ప్రకటన, ఇతర ధర్మాల ప్రకటనకు భిన్నంగా కనపడదు. ఈ చిన్న పుస్తకం ఇస్లాం ధర్మ ప్రకటన లోని ప్రామాణికతను, స్వచ్ఛతను నిరూపించే సాక్ష్యాధారాలు కొన్నింటిని మీ ముందు ఉంచటానికి ప్రయత్నిస్తున్నది. కాని తరచుగా నిజాన్ని కప్పివేసే పక్షపాతం, భావోద్వేగం, ఇతరుల

పట్ల నీచభావం(జాత్యహంకారం) మొదలైన వాటికి గురి కాకుండా పూర్తి ఏకాగ్రత మరియు నిజాయితీతో సత్యాన్వేషణ కొనసాగిస్తేనే స్వచ్ఛమైన దైవధర్మమార్గాన్ని కనుక్కోగలమనే కఠోర నగ్న సత్యాన్ని ఎట్టిపరిస్థితిలోను మరిచి పోకూడదు. కేవలం మరియు కేవలం అప్పుడు మాత్రమే సృష్టికర్త ప్రసాదించిన తెలివితేటలను ఉపయోగించి వివేచనాత్మకమైన, తర్కబద్ధమైన, స్వచ్ఛమైన సరైన నిర్ణయాన్ని తీసుకోగలము.

ఇస్లాం తనది స్వచ్ఛమైన ధర్మమని నిరూపించుకోవటానికి అనేక వాదనలను ముందుకు తీసుకువస్తున్నది. వాటిలో క్రింది మూడు వాదనలు మాత్రమే అత్యంత స్పష్టమైనవి. (ఏ పరిశోధనకైనా పునాది వంటి తర్కం, ప్రామాణికత మరియు విచక్షణ జ్ఞానాల పైనే ఈ మూడు వాదనలు ఆధారపడి ఉన్నాయి.)

1) ధర్మం పేరు యొక్క దైవికమైన మూలాధారాల (**divine origin**) పై మరియు సమగ్రమైన, విశాలమైన వాటి భావార్థం పై మొదటి వాదన ఆధారపడి ఉన్నది.

2) సృష్టికర్త, మానవుడు మరియు సృష్టి - వీటి మధ్య ఉన్న సంబంధాన్ని అసమానమైన, అద్వితీయమైన, అనుపమానమైన, సరళ బోధనల ద్వారా నిరూపించడం పై రెండవ వాదన ఆధారపడి ఉన్నది.

3) కేవలం ఇస్లాం ధర్మం మాత్రమే ఏ కాలంలోని మానవుడైనా సరే అనుసరించగల 'సార్వజనిక ధర్మం' అనే వాస్తవికత పై

మూడవ వాదన ఆధారపడిఉన్నది. అంటే ఏ కాలంలోని వారైనా, ఏ కులం వారైనా, ఏ దేశం లేక జాతివారైనా, నలుపు/తెలుపు లాంటి వర్ణభేదాలు లేకుండా మానవులందరి ద్వారా విశ్వవ్యాప్తం గా స్వీకరింపగలిగే ఏకైక, స్వచ్ఛమైన దైవధర్మం కేవలం ఇస్లాం ధర్మం మాత్రమే.

ఏ ధర్మమైనా సరే నిజంగా అది సృష్టికర్త సూచించిన సత్యమైన, స్వచ్ఛమైన ధర్మమేనా కాదా అనే నిజం తెలుసుకోవటానికి మూలాధారాలైన తర్కం, ప్రామాణికత, జ్ఞానం, విచక్షణ మరియు వివేకం మొదలైన వాటి పైనే ఈ మూడు వాదనలు ఆధారపడున్నాయి. రాబోయే పేజీలలో వీటిని కూలంకషంగా పరిశీలిద్దాం.

# 2. ధర్మం పేరు

"ఇస్లాం" అనే పదానికి అసలు అర్థం ఏమిటి? ఇది ప్రతి ఒక్కరు తెలుసుకోవలసిన మరియు స్పష్టంగా అర్థంచేసుకోవలసిన మొట్ట మొదటి విషయం. ఇది అరబీ భాష లోని పదం. ఇస్లాం అంటే "తన సంకల్పాన్ని, ఇచ్ఛాశక్తిని (ఇష్టాయిష్టాలను నిర్ణయించేశక్తిని) సత్యమైన, ఏకైక ఆరాధ్యుడికి (అల్లాహ్ కు) శాంతియుతంగా, సంపూర్ణ విధేయతతో సమర్పించుకోవటం లేక స్వాధీనం చేయటం" (అరబీ భాషలోని అల్లాహ్ అంటే ఏకైక ఆరాధ్యుడు). అలా ఏకైక ఆరాధ్యుడికి స్వయంగా సమర్పించుకున్న వారినే అరబీ భాషలో "ముస్లిం" అంటారు. కాబట్టి ఇస్లాం ధర్మం పేరు ఒక వ్యక్తి లేక తెగ పేరు మీదుగా గాని లేదా తర్వాత తరాలలోని దాని అనుచరుల నిర్ణయాన్ననుసరించి గాని పెట్టబడలేదనే విషయం ఋజువు అవుతున్నది. కాని దీనికి భిన్నంగా ఇతర ధర్మాల పేర్లు - అంటే క్రైస్తవ మతం పేరు యేసుక్రీస్తు (ఆయనపై శాంతి కలుగుగాక) పేరును అనుసరించీ, బౌద్ధమతం పేరు గౌతమ బుద్ధుని పేరును అనుసరించీ, కన్ఫూషనిజం పేరు కన్ఫూషస్ పేరు మీదుగా, మార్క్సిజమ్ పేరు కారల్ మార్క్స్ పేరు మీదుగా, యూదుమతం పేరు యూదు తెగ పేరును అనుసరించీ మరియు హిందూమతం పేరు ఒక ప్రదేశం/ప్రాంతం ఆధారంగాను ఉనికి

లోనికి వచ్చినవనే సంగతి అందరికీ తెలిసినదే. కాని ఆదిమానవుడు మరియు మొట్ట మొదటి దైవప్రవక్తైన ఆదంకు (ఆయనపై శాంతి కలుగుగాక) ఇవ్వబడిన ధర్మం కేవలం ఇస్లాం (సృష్టికర్త ఆదేశాలకు స్వయంగా సమర్పించుకోవటం) ధర్మమే. అంతే కాకుండా ఇస్లాం పదం యొక్క అర్థాన్ని అనుసరించి మానవజాతి వద్దకు పంపబడిన దైవ ప్రవక్త లందరిదీ "ఇస్లాం ధర్మమే" అనే విషయం ఋజువవు తున్నది.

ఇంకా ఇస్లాం ధర్మానికి పేరు సృష్టికర్తే స్వయంగా నిర్ణయించెను. ఎటువంటి సందేహాలకు అవకాశం లేని చివరి దైవవాణి అయిన ఖుర్ఆన్ లోని స్పష్టమైన ప్రకటనయే దీనికి మూలాధారం. దివ్యఖుర్ఆన్ లో అల్లాహ్ ఈ విధంగా ప్రకటించెను -

"ఈనాడు నేను మీ ధర్మాన్ని మీ కొరకు 'పరిపూర్ణం' చేశాను. మీ పై నా అనుగ్రహాన్ని పూర్తి చేశాను. మీ కొరకు ఇస్లాంను మీ ధర్మంగా ఎన్నుకున్నాను." ఖుర్ఆన్ 5: 3

"ఎవరైనా ఇస్లాం ధర్మమార్గం కాకుండా మరొక మార్గాన్ని అవలంబించదలిస్తే, అది ఎంత మాత్రం ఆమోదించబడదు. అతడు పరలోకంలో విఫలుడవుతాడు, నష్టపోతాడు." ఖుర్ఆన్ 3:85

కాబట్టి ఎక్కడో అరబ్ దేశంలో 7వ శతాబ్దంలో ఒక ప్రవక్త ప్రకటించిన నూతన ధర్మమని ఇస్లాం వాదించటం లేదు. కాని అంతిమరూపంలో స్పష్టంగా పునః ప్రకటింపబడిన సర్వలోక

సృష్టికర్త (అల్లాహ్) యొక్క స్వచ్ఛమైన మరియు సత్యమైన ధర్మమే ఇస్లామనే నిజాన్ని మరియు దీనిసే మౌలికంగా ఆదం (ఆయన పై శాంతి కలుగుగాక) మరియు మిగిలిన ప్రవక్తలందరికీ ఆదేశింపబడినదనే వాస్తవాన్ని మనకు తెలియజేస్తున్నది.

ఇప్పుడు తమదే సత్యమైన మార్గమని బహిరంగంగా వాదిస్తున్న రెండు ఇతర ధర్మాలను పరిశీలించుదాం. సృష్టికర్త తన ప్రవక్త మోజెస్ (ఆయనపై శాంతి కలుగుగాక)కు లేక వారి వారసులకు తమ ధర్మాన్ని యూదు మతంగా పిలవమని ఆజ్ఞాపించినట్లు వారి దివ్యగ్రంథంలో ఎక్కడా కనబడదు. అలాగే యేసుక్రీస్తు (ఆయనపై శాంతి కలుగుగాక) సహచరులకు తమ ధర్మాన్ని క్రైస్తవ మతంగా పిలవమని దైవం ఆజ్ఞాపించినట్లుగా వారి దివ్యగ్రంథమైన బైబిల్ లోనూ ఎక్కడా కనబడదు. అంటే యూదుమతం, క్రైస్తవమతం పేర్లకు మూలాధారం దైవాజ్ఞ లేక దైవామోదం ఎంతమాత్రం కాదు. యేసుక్రీస్తు (ఆయనపై శాంతి కలుగుగాక) భూలోకం నుండి పైకి పోయిన చాలా కాలం తర్వాతే యేసుక్రీస్తు ధర్మానికి క్రైస్తవమతమనే పేరు వాడుకలోకి వచ్చినది.

మరి క్రైస్తవమతమనే పేరుకు భిన్నమైన, యేసుక్రీస్తు స్వయంగా బోధించిన ధర్మం అసలు పేరు ఏమైయ్యుంటుంది? (క్రీస్తు అనే పదం ఎక్కడి నుండి వచ్చినదో ఒక్కసారి పరిశీద్దాం - జీసస్, క్రీస్తు అనే రెండు పేర్లూ గ్రీక్ మరియు లాటిన్ భాషల ద్వారా హిబ్రూ పదాల నుండి తీసుకొనబడినవి. ఆంగ్లేయ, గ్రీక్ భాషలలోని లెసొస్ అనే దానికి పర్యాయ

పదము జీసస్. అది హిబ్రూలో యేషువా లేక యెహోషువా. శీర్షికార్థం "The Anointed - ద అనయిన్టెడ్" అంటే హిబ్రూలోని మెస్సయ్య పదానికి అనువాదము క్రీస్తోస్ అనే గ్రీకుపదం)

సృష్టికర్తతో గల సంబంధం వైపుకు నేరుగా దారిచూపే స్పష్టమైన మార్గాన్ని మాత్రమే అనుసరించమని యేసుక్రీస్తు చేసిన బోధనలే వారి అసలు ధర్మంలో కనబడాలి. ఇస్లాం ధర్మ బోధనల ప్రకారం యేసుక్రీస్తు అల్లాహ్ పంపిన ఒక గొప్ప ప్రవక్త, అరబీలో భాషలో ఆయన పేరు ఈసా (అలైహిస్సలాం). పూర్వపు ప్రవక్తల మాదిరిగానే తను కూడా తమ ఇచ్ఛాశక్తి/సంకల్పశక్తిని సృష్టకర్తకు స్వాధీనం చేయమని, సమర్పించుకోమని ప్రజలకు పిలుపునిచ్చారు. (మరి ఇస్లాం ధర్మమంటే ఇదే కదా!) దైవాన్ని ఈ విధంగా ఆరాధించమని యేసుక్రీస్తు తన సహచరులకు బోధించినట్లు వారి దివ్యగ్రంథమైన 'బైబిల్' లో పేర్కొనబడినది. "పరలోక మందున్న మా తండ్రీ, నీ నామము పరిశుద్ధ పరచబడుగాక; నీ రాజ్యమచ్చు గాక; నీ చిత్తము పరలోక మందు నెరవెర్చుచున్నట్లు భూమియందును నెరవేరును గాక" (లూకా 11: 2 మరియు మత్తయి 6:9-10) గోస్పెల్స్ లోని అనేక ప్రకటనలలో యేసుక్రీస్తు ఇటువంటి బోధనలకు ప్రాధాన్యతనిచ్చెను. ఉదాహరణగా మరొక చోట ఎవరైతే దేవుడికి స్వయంగా సమర్పించుకుంటారో, వారే స్వర్గాన్ని వారసత్వంగా పొందుతారని యేసుక్రీస్తు బోధన చేసెను.

"ప్రభువా, ప్రభువా, అని నన్ను వెంబడించువాడు పరలోక రాజ్యంలో చేరడు. పరలోక రాజ్యమందున్న నా తండ్రిని గైకొనిన యెడల, పరలోకరాజ్యలో చేరబడును" (మత్తయి7-21)

తనూ సృష్టికర్తకు సమర్పించుకున్నవాడినేనని యేసుక్రీస్తు (ఆయనపై శాంతి కలుగుగాక) స్వయంగా పేర్కొనెను - "నా అంతట నేనే ఏమియు చేయలేను; నేను వినునట్లుగా తీర్పు ఇచ్చు చున్నాను. నన్ను పంపిన వాని చిత్తప్రకారమే చేయగోరుదును గాని నా యిష్ట ప్రకారము చేయుగోరను గనుక నా తీర్పు న్యాయమైనది". (యోహాను 5:30).

తానే నిజమైన దైవం కాదని యేసుక్రీస్తు తన సహచరులకు స్పష్ట పరచినట్లు గోస్పెల్ లో అనేక బోధనలు ప్రకటిస్తున్నాయి "ఆ దినమును గూర్చియు ఆ ఘడియను గూర్చియు తండ్రి తప్ప ఏ మనుష్యుడైనను, పరలోకమందలి దూతలైనను, కుమారుడైనను ఎరుగరు". (మార్కు 13:32).

కాబట్టి, తన కంటే ముందు వచ్చిన ప్రవక్తల మాదిరిగా మరియు తన తర్వాత వచ్చిన ప్రవక్త ముహమ్మద్ (ఆయనపై శాంతి కలుగుగాక) మాదిరిగా యేసు (ఆయనపై శాంతి కలుగుగాక) కూడా ఇస్లాం మతాన్నే బోధించెను. అంటే తమ తమ సంకల్పశక్తిని, ఇష్టాఇష్టాలను సత్యమైన ఆ ఏకైక ఆరాధ్యుడికే శాంతియుతంగా, విధేయతాపూర్వకంగా, స్వయంగా సమర్పించుకోమని బోధించటం

# 3. సృష్టికర్త మరియు సృష్టి

సర్వలోక సృష్టికర్త దివ్యధర్మమైన ఇస్లాం యొక్క ప్రధాన సందేశం కేవలం ఏకైక దైవారాధన మాత్రమే. ఎందుకంటే తన ఇచ్ఛాశక్తిని, సంకల్పాన్ని సత్యమైన ఏకైక ఆరాధ్యుడికి పూర్తిగా సమర్పించు కోవడమే ఇస్లాం ధర్మంలో ఆరాధన యొక్క ముఖ్యాంశం. ఇంకా ఆ ఏకైక ఆరాధ్యుడిని వదిలి వేరే ఏ మానవుడినీ, ప్రాంతాన్ని లేక వస్తువునూ ఆరాధించకూడదని ఆజ్ఞాపిస్తున్నది. సర్వలోక సృష్టికర్త తప్ప విశ్వంలో మిగిలిన ప్రతిది అతడి సృష్టియే కావటం వలన, సృష్టి ఆరాధనను పూర్తిగా వదిలివేసి, కేవలం సృష్టికర్తను మాత్రమే ఆరాధించమని ఇస్లాం ధర్మం ఆహ్వానిస్తున్నది. కేవలం అతడి ఇష్టానుసారమే ప్రార్థనలు స్వీకరించబడతాయి కాబట్టి కేవలం ఆ సర్వలోక సృష్టికర్తైన ఏకైక ఆరాధ్యుడు మాత్రమే మానవుల ఆరాధనలకు అర్హుడు, యోగ్యుడు. చిట్టచివరి దైవ గ్రంథమైన ఖుర్ఆన్ స్పష్టంగా ఇలా ప్రకటిస్తున్నది.

"మానవులారా! మిమ్ముల్ని, మీ పూర్వీకుల్ని సృష్టించిన మీ ప్రభువును ఆరాధించండి. అప్పుడే మీరు రక్షింపబడతారని ఆశించవచ్చు. ఆయనే మీకోసం నేలను పాన్పుగా, నింగిని కప్పుగా చేశాడు. పై నుండి వర్షాన్ని కురిపించేవాడు కూడా ఆయనే. ఆ వర్షం ద్వారా ఆయన రకరకాల పండ్లూ, పంటలు పండించి మీకు ఆహారం సమకూర్చిపెడుతున్నాడు. కనుక ఆ

యదార్థాలు తెలిసిన తర్వాత మీరు ఇతర శక్తులను అల్లాహ్ కు సాటి కల్పించకండి" దివ్యఖుర్ఆన్ 2: 21-22

కాబట్టి ఏదైనా ఒక చెట్టును తమ కోరికలు తీర్చమని వేడుకున్నట్లైతే, అవి తీర్చబడటం ఆ చెట్టు మహాత్యం ఎంత మాత్రమూ కాదు. కేవలం సర్వలోక సృష్టికర్త ఆ కోరికలు పూర్తయ్యే విధంగా పరిస్థితులను అనుమతించటం వలననే అవి తీర్చబడినాయి. అంతేగాని ఆ చెట్టుకు ప్రజల కోరికలను స్వయంగా తీర్చగలిగే శక్తి అణుమాత్రం కూడా లేదు. కొంత మంది దీనినొక యాధృచ్ఛికమైన ఘటన అని అంటారు. కాని భక్తులు మాత్రం ఆ చెట్టుకు తమ కోరికలు తీర్చే దివ్యశక్తి ఉందని గుడ్డిగా నమ్ముతారు. అదేవిధంగా జీసస్, గౌతమబుద్ధుడు, శ్రీకృష్ణుడు, సెయింట్ క్రిష్టోఫర్, సెయింట్ జూడ్, లేక ముహమ్మద్ మొదలైన వారికి చేయబడుతున్న ప్రార్థనలకు వారు సమాధానం ఇవ్వరు. కాని సృష్టికర్త, స్వయంగా తనే ఇష్టపడి ఆ ప్రార్థనలకు కూడా సమాధానమివ్వవచ్చు అంటే ఆ కోరికలను తీర్చవచ్చు. జీసస్ ఏనాడూ తన సహచరులకు తననే ఆరాధించమని సూచించలేదు కానీ సృష్టికర్తను మాత్రమే ఆరాధించమని బోధించెను.చివరి దైవగ్రంథమైన ఖుర్ఆన్ ఇలా ప్రకటిస్తున్నది -

ఆ తరువాత అల్లాహ్(తీర్పుదినాన) ఈసాను నిలబెట్టి "మర్యం కుమారుడవైన ఈసా! నీవు నీ ప్రజలతో, అల్లాహ్ ను కాదని 'నన్నూ, నా తల్లినీ దేవుళ్ళుగా భావించండి' అని బోధించావా?"

అని అడిగినపుడు ఆయన ఇలా మనవి చేసుకుంటాడు: "నీవు అత్యంత పవిత్రుడవు! ఏ మాటను పలికే హక్కు నాకు లేదో, ఆ మాటను అనటం నాకు యుక్తమైన పనికాదు. ఒకవేళ నేను ఆ విధంగా అనుంటే, అది నీకు తప్పకుండా తెలిసుండేది. నా మనస్సులో ఏమి ఉన్నదో నీకు తెలుసు. నీ మనస్సులో ఏముందో నాకు తెలియదు. నీవు గుప్తంగా ఉన్న యధార్థాలన్నీ తెలిసిన మహాజ్ఞానివి". దివ్యఖుర్ఆన్ 5:115-116

అంతే కాకుండా యేసుక్రీస్తు ఏనాడూ స్వయంగా తనను తానే ఆరాధించుకోలేదు. నిశ్చయంగా అతడు దేవుడినే ఆరాధించెను. గోస్పెల్ లో యేసు ఇలా బోధించెను - "నీ దేవుడైన ప్రభువునకు మ్రొక్కి ఆయనను మాత్రమే సేవింపవలెను" అని వ్రాయబడి యున్నది. (లూక్ 4 : 8).

ఇదే మూల సిద్ధాంతం చివరి దైవ గ్రంథమైన దివ్యఖుర్ఆన్ లోని మొట్టమొదటి అధ్యాయం ఫాతిహా 4వ వాక్యంలో కూడా స్పష్టంగా తెలియచేయబడినది - "మేము నిన్నే ఆరాధిస్తున్నాము మరియు నీ సహాయమే అర్థిస్తున్నాము." దివ్యఖుర్ఆన్ 1:4

ఇంకో చోట అల్లాహ్ ఇలా ప్రకటించెను - "మీ ప్రభువు ప్రకటిస్తున్నాడు: "నన్ను ప్రార్థించండి, నేను మీ ప్రార్థన స్వీకరిస్తున్నాను."" దివ్యఖుర్ఆన్ 40:60

ఇక్కడ ఒక ముఖ్యమైన విషయం గమనించవలెను. ఇస్లాం ధర్మం యొక్క మూల సందేశం అంటే ఏకైక దైవారాధన వివరించే దేమిటంటే సృష్టికర్త మరియు అతడి సృష్టి రెండూ వేర్వేరు విభిన్నమైన విషయాలు. సర్వలోక సృష్టికర్త మరియు సృష్టి లేక సృష్టిలోని ఏదైనా భాగం ఎప్పుడూ సమానం కాజాలవు. అలాగే సృష్టి మరియు సృష్టికర్త లేక సృష్టికర్తలోని ఏదైనా భాగం కూడా ఎప్పుడూ సమానం కాజాలవు.

పై విషయం చాలా సహజంగా కనబడవచ్చు. కాని మానవుడు ఏకైక ఆరాధ్యుడిని అంటే సర్వలోక సృష్టికర్తని ఆరాధించటానికి బదులుగా సృష్టిని ఆరాధించటానికి ముఖ్యకారణం దైవసంకేతాల ను గుర్తించడంలో అతడు చేస్తున్న ఘోరమైన పొరపాటే. ఇది అజ్ఞానం, నిర్లక్ష్యం వలన కావచ్చు. సృష్టిలోని ప్రతి చోట దేవుడు వ్యాపించి ఉన్నాడని, దైవత్వం సృష్టిలో వ్యాపించి ఉన్నదని, దైవత్వం సృష్టిలోని కొన్ని భాగాలలో అవతరించి ఉన్నదనే మూఢ నమ్మకాల ఆధారంగా తను పాటిస్తున్న సృష్టి ఆరాధనే నిజానికి దైవారాధనని దృఢంగా నమ్ముతున్నాడు. కానీ ప్రతి కాలం లోనూ, ప్రతి ప్రాంతం లోనూ దైవప్రవక్తలు తీసుకు వచ్చిన ఇస్లాం సందేశం ఏమిటంటే "కేవలం ఆ సృష్టికర్తను మాత్రమే ఆరాధించండి మరియు సృష్టి ఆరాధనల (బహుదైవారాధన లేక దానికి దారితీసే పూజలు, పురస్కారాలు, మొక్కుబడులు...) నుండి దూరంగా ఉండండి. చివరి దైవగ్రంథమైన ఖుర్ఆన్ లో

స్పష్టంగా ఇలా ప్రకటింపబడినది - **"మేము ప్రతి జాతిలోనూ ప్రవక్తను పంపాము. అతడి ద్వారా "కేవలం ఏకైక దైవాన్ని మాత్రమే ఆరాధించండి. దుష్టశక్తుల్ని ఆరాధించకండి" అని అందరికీ బోధపర్చాము."** దివ్యఖుర్ఆన్ 16 : 36

మానవులు తయారుచేసిన విగ్రహాలకు మీరు ఎందుకు సాష్టాంగ పడుతున్నారు? అని ఎవరైనా విగ్రహారాదకులను అడిగినట్లైతే, తాము పూజిస్తున్నది రాతి విగ్రహానికి కాదని అందులోని దైవస్వరూపానికని స్థిరంగా సమాధానమిస్తారు. విగ్రహం కేవలం దైవారాధనకు అవసరమైన ఏకాగ్రతను కలిగిస్తుందే తప్ప అది స్వయంగా దైవం కాదని చెబుతారు. సృష్టికర్తే ఏదో ఒక రూపంలో సృష్టిలో వ్యాపించి ఉన్నాడని నమ్ముతున్న వారే విగ్రహారాధన సిద్ధాంతాన్ని తేలికగా విశ్వసిస్తారు. కాని ఎవరైతే ఇస్లాం యొక్క మూల సందేశం మరియు దాని భావాన్ని (సృష్టికర్త & సృష్టి రెండూ విభిన్నమైనవి. కేవలం సృష్టికర్తే ఆరాధ్యుడు, కాని సృష్టికాదు అని) గ్రహిందారో, వారెప్పుడూ ఎంతటి అవివేకంలోనూ, ఎట్టి పరిస్థితులలోనూ, అట్టడుగుకు దిగజారిన స్థితిగతులలోనూ విగ్రహారాధన చేయటానికి అంగీకరించరు.

ఎవరైతే తమలో దైవత్వం ఉందని ప్రాచీనకాలం నుండి ప్రకటిస్తున్నారో, వారు తరచుగా 'సృష్టికర్త (దేవుడు) మనిషిలోనే ఉన్నాడు' అనే అస్పష్టమైన భ్రమపై ఆధారపడి ఉన్నట్లు తెలుస్తుంది. ఇంకో అడుగు ముందుకు వేసి సృష్టికర్త ఇతర

మానవులలో కంటే తమలో ఎక్కువగా ఉన్నాడని, కాబట్టి అందరూ తమకే సాష్టాంగపడి, సమర్పించుకుని, మానవుడి అవతారంలో ఉన్న సృష్టికర్తగా లేక సృష్టికర్త ఇతరుల కంటే తమపైనే ఎక్కువగా కేంద్రీకరించి మరియు తమలో కలిసిపోయి ఉన్నందు వలన తమనే దైవసంభూతుడిగా ఆరాధించమంటారు. ఇంకా సృష్టికర్తే మానవుడిలో అవతరించి ఉన్నాడనే కలుషిత అంధవిశ్వాసంలో మునిగి ఉన్న సహచరుల వలన, మరికొందరు మంచి వ్యక్తులు (సంఘసేవకులకు) మరణించగానే దైవత్వం పొందినట్లుగా ప్రసిద్ధి చెందుతారు. (వారి పటాలను అమ్ముకుంటూ, వారి సమాధులకు, విగ్రహాలకు పూజలు చేస్తూ, ఆ పుణ్యపురుషుల దీవెనలు పొందటం కోసం హుండీలో డబ్బులు, బంగారం, వెండి మొదలైన విలువైన సంపదను దానం చేయమని ప్రోత్సహిస్తారు. చివరికి దానిని పంచుకుంటారు. దైవత్వం పేరు మీద నిలువు దోపిడి చేస్తున్న ఇటువంటి నూతన వ్యాపార కేంద్రాలు ఇటీవల కాలంలో విపరీతంగా పెరగటం మనం కళ్ళారా చూస్తున్నాం)

ఇంతవరకు స్పష్టంగా గ్రహించవలసినది ఏమిటంటే, ఇస్లాం మూలసిద్ధాంతాన్ని మరియు దాని భావాన్ని అర్థం చేసుకున్న వారెవరైనా సరే ఇతర మానవులను లేక సృష్టిని పూజించటాన్ని ఎట్టిపరిస్థితిలోను, ఏ కాలంలోను అంగీకరించరు. స్వచ్ఛమైన మరియు సత్యమైన దైవధర్మం చాలా స్పష్టంగా సృష్టికర్తను మాత్రమే ఆరాధించమని మరియు సృష్టి ఆరాధన ఏ రూపంలో ఉన్నా సరే దాన్ని నిరాకరించమని మాటిమాటికి బోధిస్తున్నది.

ఇదే ఇస్లాం యొక్క దీక్షావాక్యం - లా ఇలాహ ఇల్లల్లాహ్ అంటే అల్లాహ్(ఏకైక ఆరాధ్యుడు) తప్ప వేరే ఆరాధ్యుడు ఎవ్వడూ లేడు చిత్తశుద్ధితో, మనస్ఫూర్తిగా పై దీక్షావాక్యాన్ని పలికి ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)ను చివరి దైవప్రవక్తగా నమ్మే విశ్వాస ప్రకటనే, సృష్టికర్త అంగీకరించే ధర్మంలోనికి చేరుస్తుంది మరియు ఆ విశ్వాసంలోని చిత్తశుద్ధి అలా విశ్వసించినవారిని స్వర్గంలో చేర్చే బాధ్యతను తీసుకుంటుంది. చివరి ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రకటించారు, "ఎవరైనా అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యుడు లేడని విశ్వసించి, ఆ విశ్వాసంతోనే మరణించినట్లైతే, అతడు స్వర్గంలో ప్రవేశిస్తాడు"

ఈ విశ్వాస ప్రకటనలోని నిగూఢవిశ్వాసం తమ మనోసంకల్పాన్ని దైవప్రవక్తలు బోధించినట్లుగా ఏకైక ఆరాధ్యుడైన సృష్టికర్తకు స్వయంగా సమర్పించుకోమని ఆదేశిస్తున్నది. అలాంటి వారిని అసత్యపు దేవుళ్ళ దరిదాపులకు కూడా పోవద్దని ఆజ్ఞాపిస్తున్నది.

# 4. కలుషిత ధర్మాల సందేశం

ప్రపంచంలో అనేక జాతులు, వర్గాలు, మతాలు, వైజ్ఞానిక భావనలు మరియు ఉద్యమాలు కేవలం తమదే స్వచ్ఛమైన, సత్యమైన మార్గమని లేదా కేవలం మరియు కేవలం తమదే సరైన మార్గమని దావా చేస్తున్నాయి. అయితే వీటిలో ఏది స్వచ్ఛమైనది? ఏది సత్యమైనది? లేదా అన్నీ స్వచ్ఛమైన, సత్యమైన మార్గాలేనా? దీని సమాధానం తెలుసుకోవటానికి ఒక ఉన్నతమైన పద్ధతి ఉన్నది 'తమదే స్వచ్ఛమైన దైవమార్గం' అని దావాచేస్తున్న వారందరి బోధనల నుండి సారంలేని పైపైని భేదాలను, చేర్చబడిన మార్పులు, చేర్పులను తొలగించి, స్పష్టంగా / అస్పష్టంగా పిలుస్తున్న వారి ఆరాధనల యొక్క కేంద్రీయ ఉద్దేశ్యాన్ని గుర్తించటం. అంధవిశ్వాసాలన్నింటిలోనూ ఆరాధ్యుడి గురించి సామాన్యంగా కనిపించే విషయమేమిటంటే అవి మానవులందరూ ఆరాధ్యులు (దేవుళ్ళు)గా లేక కొందరు ప్రత్యేకమైన పురుషులు మాత్రమే ఆరాధ్యులుగా లేక ప్రకృతియే దైవంగా లేక సృష్టికర్తను మానవుల తలంపు, ఊహాశక్తి లోని ఒక కల్పనగా ప్రకటించటం.

కాబట్టి అంధవిశ్వాసాల మూలసందేశం 'సృష్టినే సృష్టికర్తగా (దైవంగా) ఆరాధించవచ్చు' అని సూచిస్తున్నది. ఇటువంటి ధర్మాలు సృష్టిని లేక అందులోని ఏదో ఒక భాగాన్ని/ఆకారాన్ని

ఆరాధ్యుడిగా చేసి వేడుకోమని పిలుపునిస్తూ, మానవుడిని సృష్టి ఆరాధనకు ప్రేరేపిస్తున్నాయి. ఉదాహరణకు ప్రవక్త యేసుక్రీస్తు తన సహచరులను 'ఏకైక ఆరాధ్యుడిని(సృష్టికర్తను)' మాత్రమే ఆరాధించమని పిలుపునివ్వగా ఆయన అనుచరులనబడే వారు యేసుక్రీస్తునే ఆరాధించమని పిలుపునిస్తున్నారు. ఇంకా వారిలో కొందరు యేసుక్రీస్తు కూడా దేవుడే అని ప్రకటిస్తున్నారు.

గౌతమ బుద్ధుడు ఒక గొప్ప సంఘసంస్కర్త. హిందూ ధర్మంలో ఆయన అనేక మానవతా సిద్ధాంతాలను చేర్చేను. కాని తనే దేవుడని ఆయన తన జీవితంలో ఏనాడూ ప్రకటించలేదు. ఇంకా తను కూడా మానవుల ఆరాధనలకు అర్హుడని సహచరులకు సూచించినట్లు ఆయన బోధనలలో ఎక్కడా కనబడదు. కాని నేడు భారతదేశానికి వెలుపల ఉన్న అనేక బౌద్ధమతస్థులు గౌతమ బుద్ధుడినే దేవుడిగా చేసేసినారు. అవివేకం వలన వారు అతడి రూపమును పోలిన విగ్రహాలను తయారు చేసి, వాటికే సాష్టాంగ పడుతున్నారు.

ఆరాధ్యుడిని గుర్తించే నియమనిబంధనలను అనుసరించి, తేలికగా అంధవిశ్వాసాలను కనుక్కోవటమే కాకుండా, వాటి కల్పిత, కలుషిత భావాల పుట్టుకను కూడా గుర్తించ వచ్చును. చివరి దైవగ్రంథమైన ఖుర్ఆన్ లో సృష్టికర్త ఇలా ప్రకటించెను. "ఆయన్ని వదలి మీరు ఏ ఏ దైవాలను

ఆరాధిస్తున్నారో అవన్నీ మీరు, మీ తాతముత్తాత లు పెట్టుకున్న కొన్నిపేర్లు (అంటే అభూతకల్పనలు) మాత్రమే. వాటి కోసం సృష్టికర్త ఎలాంటి ఆజ్ఞ పంపలేదు. పాలనాధికారం సృష్టికర్తకు తప్ప మరెవ్వరికీ లేదు. ఆయన తనను తప్ప మరెవ్వరినీ ఆరాధించ కూడదని శాసించాడు. ఇదే సరైన జీవనమార్గం. కాని చాలా మంది (ఈ యదార్థాన్ని) గ్రహించడం లేదు." దివ్యఖుర్ఆన్ (12:40)

అన్ని మతాలు మంచినే బోధిస్తాయి కాబట్టి ఏ మతం అనుసరిస్తే ఏమిటి? అని కొందరు వాదించ వచ్చును. దీనికి సమాధానం - కలుషిత విశ్వాసాలన్నీ మంచిని ప్రోత్సహించటంతో పాటు, 'సృష్టి ఆరాధన' అనే ఘోరాతి ఘోరమైన పాపాన్ని కూడా చేయమని బోధిస్తున్నాయి. సృష్టి ఆరాధన ఘోరాతి ఘోరమైన పాపమవటానికి గల ముఖ్యకారణం - సృష్టి యొక్క మూల ఉద్దేశ్యాన్ని ఇది వ్యతిరేకించటం. విగ్రహారాధనకు మూలాధారమైన ఈ సృష్టి ఆరాధనను ఎట్టి పరిస్థితిలోను క్షమించనని సృష్టికర్త స్వయంగా ప్రకటించినాడు. మానవుడు తనను ఆరాధించటానికి మాత్రమే సృష్టించబడినాడనే విషయాన్ని, చివరి దైవ గ్రంథమైన దివ్యఖుర్ఆన్ లో సృష్టికర్త ప్రత్యేకంగా ఇలా ప్రకటిస్తున్నాడు.

"నేను జిన్నాతుల్ని, మానవుల్ని నన్ను ఆరాధించటానికి తప్ప మరే లక్ష్యంతోనూ పుట్టించలేదు." ఖుర్ఆన్ 51:56

కాబట్టి విగ్రహారాధనకు మూలమైన 'సృష్టి ఆరాధన' అనేది

ఎట్టిపరిస్థితులలోను క్షమింపబడని ఒకే ఒక ఘోరమైన పాపం. ఎవరైతే బహుదైవారాధకులుగా, విగ్రహారాధకులుగా, సృష్టి ఆరాధకులుగా మరణిస్తారో, వారు శాశ్వత స్వర్గ జీవితాన్ని స్వయంగా నాశనం చేసుకుంటున్నారు. ఇది ఎవరో పండితులు ప్రకటించిన మానవ అభిప్రాయం కాదు. దైవవాణి ద్వారా చిట్టచివరి దివ్యగ్రంథం (ఖుర్ఆన్) లో సృష్టికర్త స్వయంగా, స్పష్టంగా చేసిన హెచ్చరిక.

"సృష్టికర్త తనకు సాటి కల్పించడాన్ని ఎట్టి పరిస్థితిలోనూ క్షమించడు. అది తప్ప ఇతర పాపాలను ఆయన తలుచు కుంటే క్షమిస్తాడు" దివ్యఖుర్ఆన్ 4:48, 4:116

# 5. దైవధర్మపు సార్వజనికత

సార్వజనికత అంటే ప్రపంచంలోని అన్ని ప్రాంతాలలోను, అన్ని కాలాలలోను సామాన్య మానవుడికి కూడా తేలికగా అందుబాటులో ఉండటం. కలుషితమైన అంధవిశ్వాసాలను, ధర్మాన్ని అనుసరించటం వలన కలిగే దుష్పరిణామం చాలా తీవ్రమైనది కావటం వలన, స్వచ్ఛమైన ఏకైక దైవధర్మం ప్రజలందరికీ అర్థమయ్యేదిగానూ, ప్రపంచవ్యాప్తంగా ప్రతికాలంలోను సులభంగా ఆచరించేదిగానూ అయి వుండాలి. ఇంకా ఎటువంటి అంతరాయం లేకుండా ప్రళయం వరకు కొనసాగేదిగా ఉండాలి. అంటే సృష్టికర్త యొక్క నిజమైన, సత్యమైన, స్వచ్ఛమైన ధర్మం ఏ ఒక్క వ్యక్తికీ లేక ప్రాంతానికీ లేక కాలానికీ పరిమితం కానిదై ఉండాలి. ఇంకా అది దాసుడికి - సృష్టకర్తకు మధ్య వర్తించని నియమ నిబంధనల్ని (బాప్టిజం, మానవుడిని దైవకుమారుడిగా మరియు తనను పాపాల శిక్ష నుండి రక్షించేవాడుగా లేక మధ్యవర్తిగా నమ్మటం వంటివి) విధించే తర్కపు ఆలోచనలు లేనిదై ఉండాలి. కేంద్రీయ మూల సిద్ధాంతం మరియు నిర్వచనం (సంకల్పాన్ని సృష్టికర్తకు స్వయంగా సమర్పించుకోవటం) ద్వారా ఇస్లాం ధర్మపు సార్వజనికత యొక్క మూలాధారం స్పష్టంగా ఋజువవుతున్నది. ఎప్పుడైనా, ఎక్కడైనా, ఎవరైనా సరే "సృష్టికర్త ఒక్కడే" అని విశ్వసించి, "సృష్టికర్తకు మరియు సృష్టికి మధ్య అణువంత పోలిక కూడా

లేదు" అనే వాస్తవాన్ని గ్రహించి, స్వయంగా సృష్టికర్తకు సమర్పించుకున్నట్లైతే అతడు భౌతికంగా మరియు ఆధ్యాత్మికంగా ముస్లిం అని పిలవబడుతూ స్వర్గంలోకం లోనికి ప్రవేశించే అర్హత పొందుతాడు.

కాబట్టి, ఎవరైనా, ఎప్పుడైనా, ప్రపంచంలోని ఏ మారుమూల ప్రాంతంలోని వారైనా సరే ముస్లింగా మారవచ్చును. అంటే సృష్టి ఆరాధన వదిలి, కేవలం ఏకైక సృష్టికర్తను విశ్వసిస్తూ, సత్యమైన దైవధర్మాన్ని (ఇస్లాంను) స్వీకరించవచ్చును. అసలు సృష్టికర్తకు తన సంకల్పాన్ని సమర్పించుకోవటానికి మానవుడు ఎల్లప్పుడూ మంచి - చెడుల మధ్య సరైన ఎంపిక చేయవలసి ఉన్నదనేది ఇక్కడ గమనించదగిన ముఖ్యవిషయం. సృష్టికర్త మానవుడికి చెడు నుండి మంచిని వేరు చేసే విచక్షణా జ్ఞానాన్ని ఇవ్వడమే కాకుండా రెండింటిలో ఒకదాన్ని ఎన్నుకునే శక్తి యుక్తులను కూడా ప్రసాదించెను. ఈ దివ్యమైన శక్తియుక్తులు తమతో పాటు మానవుడు తన ఇష్టానుసారంగా ఎన్నుకున్న మార్గం గురించి, తీర్పుదినం నాడు స్వయంగా సృష్టికర్తకు సమాధానం ఇవ్వవలసి ఉన్నదనే ముఖ్యమైన గురుతర బాధ్యతను కూడా మనకు చేరవేస్తున్నాయి. అందువలన సృష్టికర్త ఆజ్ఞాపించిన మంచి పనులు చేస్తూ, నిషేధించిన చెడు పనుల నుండి తప్పించుకుంటూ జీవించటానికి శాయశక్తులా ప్రయత్నించ వలెను. చిట్టచివరి దివ్యగ్రంథమైన ఖుర్ఆన్ లో

ఇలా ప్రకటింపబడినది. "ముస్లింలుగాని, యూదులుగాని, క్రైస్తవులుగాని, సాబీలు (నక్షత్రోపాసకులు) గాని, మరే మతానికి , వర్గానికి, జాతికి చెందిన వారైనా సరే అల్లాహ్ ను, ప్రళయదినాన్ని విశ్వసించి తదనుగుణంగా సత్కార్యాలు చేస్తుంటే, అలాంటి వారికి వారి ప్రభువు వద్ద తప్పకుండా మంచి ప్రతిఫలం లభిస్తుంది. వారికి ఎలాంటి భయంగాని, దుఃఖం గాని ఉండదు." దివ్యఖుర్ఆన్ 2: 62

చాలా స్పష్టంగా వివరించినప్పటికీ ఏదో ఒక కారణంగా చివరి దైవసందేశమును స్వీకరించటంలో వెనుకాడుతున్న మానవులు, అత్యంత ప్రమాదకరమైన స్థితిలో జీవిస్తున్నారనే కఠోర సత్యాన్ని గ్రహించాలి. చిట్టచివరి ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం చేసిన ప్రకటన ఒక హదీథ్ గ్రంథంలో ఇలా రికార్డు చేయబడినది. 'క్రైస్తవులలోగాని, యహూదియులలో గాని ఎవరైనా సరే నా గురించి విని, నేను తెచ్చిన (దివ్యఖుర్ఆన్) దానిని విశ్వసించక మరణించినట్లైతే, అతడు నరకవాసులతో పాటు లేపబడతాడు.'
సహీముస్లిం[EnglishTranslation],Vol.1P.91No 284

# 6. సృష్టికర్తను గుర్తించటం

ఇక్కడ ఉదయించే ప్రశ్న ఏమిటంటే వేర్వేరు సమాజంలోని, వివిధ సంస్కృతులలోని విభిన్న నమ్మకాలు గల ప్రజలందరూ ఒకే ఒక సత్యమైన సృష్టికర్తను ఎలా విశ్వసించగలరు? సత్యమైన ఏకైక సృష్టికర్త ఆరాధనకు మానవుల్ని బాధ్యులుగా చేయాలంటే ఆ దైవాన్ని గుర్తించే జ్ఞానం వారి అందుబాటులో ఉండాలి కదా!  సత్యమైన దైవాన్ని గుర్తించే జ్ఞానం, వివేకం ప్రతిమానవుడి ఆత్మపై సహజత్వంలో భాగంగా ముద్రింపబడి ఉంటాయని చిట్టచివరి దైవగ్రంథమైన ఖుర్ఆన్ బోధిస్తున్నది. ఈ స్థితిలోనే మానవుడు జన్మిస్తాడు. మానవజాతి ఉనికిలోనికి రావడానికి కారణమైన ఆదిమానవుడు ఆదం (అలైహిస్సలాం)ను సృష్టించినప్పుడే ఆదం సంతతిగా జన్మించబోయే ఆత్మలందరి నుండీ సృష్టికర్త వాగ్దానం తీసుకొనెను. ఈ విషయాన్ని ఖుర్ఆన్ 7వ అధ్యాయం, అల్ అరాఫ్ 172–173 లో అల్లాహ్ స్పష్టంగా ఇలా వివరించెను - నీ ప్రభువు ఆదం వీపు నుండి అతడి సంతతి భావితరాల ఆత్మలను తీసి ప్రమాణం చేయించిన సందర్భం. అప్పుడు మేము వారికి వారినే సాక్షులుగా పెడుతూ "నేను మీ ప్రభువుని కానా?" అని అడిగాము, దానికి వారు "మీరే మా ప్రభువు. అందుకు మేమే సాక్షులం" అన్నారు.

అప్పుడు అల్లాహ్ తనే సర్వలోక సృష్టికర్త మరియు ఆరాధనలకు

అర్హత కలిగిన ఏకైక దైవం అనే సత్యానికి మానవులందరినీ ఎందుకు సాక్షులుగా చేసాడో వివరిస్తూ, దివ్యఖుర్ఆన్ 7:172 లో ఇలా ప్రకటించెను - మీమిలా చేయడానికి కారణం, రేపు తీర్పు దినామున మీరు "మాకీ విషయం తెలియదని" చెప్పవచ్చు.

అంటే అతి భయంకరమైన ఆ తీర్పుదినాన అల్లాహ్ యే మన సృష్టికర్త అనే విషయం తెలియదని చెప్పి తప్పించుకోలేం. ఇంకా సృష్టికర్తను మాత్రమే ఆరాధించమని ఎవ్వరూ చెప్పలేదని కూడా ఆరోపించలేము. ఇదే విషయమును అల్లాహ్ దివ్యఖుర్ఆన్ లో ఇలా వివరిస్తున్నాడు - లేదా "బహుదైవారాధన మాకు పూర్వం మా తాతముత్తాత లు ప్రారంభించారు. మేము ఆ తరువాత ఆ సంతతి నుండి పుట్టాము. అలాంటప్పుడు దుర్జనులు చేసిన ఆ తప్పుకు మమ్మల్ని పట్టుకుంటారా?" అని చెప్పవచ్చును. దివ్యఖుర్ఆన్ 7:173

కాబట్టి ప్రతి శిశువు సృష్టికర్తే తన ఆరాధ్యుడని ప్రకృతి సహజంగా విశ్వసిస్తూ జన్మిస్తాడు మరియు ఆయనను మాత్రమే ఆరాధించే దృఢనిశ్చయం అతడిలో పుట్టుకతోనే ఉంటుంది. "నేను నా దాసులను స్వచ్ఛమైన మతంలోనే సృష్టించాము కాని దుష్టశక్తులు వారిని కలుషిత(చెడు) దారి పట్టించాయి" అనే అల్లాహ్ ప్రకటనను, చివరి దైవ ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం మానవాళికి చేర్చి ఉన్నారు. ఇంకా ప్రవక్త

ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా బోధించారు "ప్రతి శిశువు పుట్టుకతోనే సహజసిద్ధంగా ఏకైక ఆరాధ్యుడికి తనను తాను సమర్పించుకుంటాడు. కాని తల్లితండ్రులు ఆ బిడ్డను తాము అనుసరిస్తున్న మతస్థుడిగా అంటే యూదుడిగానో, క్రైస్తవుడిగానో లేక అగ్నిపూజ చేసే పారశీ మతస్థుడిగానో మారుస్తారు."

ఒకవేళ పిల్లలను ఒంటరిగా వదిలివేసినట్లైతే, వారు సృష్టికర్తను తమకు తోచిన పద్ధతిలో ఆరాధిస్తారు. కానీ వారికి పరిసర ప్రభావములు అంతటి స్వాతంత్ర్యాన్ని ఇవ్వవు. ఏ విధంగానైతే ప్రతి శిశువు దైవం విధించిన ప్రకృతి సహజ భౌతిక నియమాలకు (నిద్ర, ఆకలిదప్పికలు, మలమూత్రవిసర్జన......) సమర్పించు కుంటాడో, అదే విధంగా అతడి ఆత్మ కూడా 'ఏకైక ఆరాధ్యుడైన అల్లాహ్ యే తన సృష్టికర్త' అనే వాస్తవమునకు సహజసిద్ధంగా సమర్పించుకుంటుంది. కానీ, తల్లితండ్రులు అతడిని వేరే దారిని అనుసరించేటట్లు చేస్తే, దానిని ఆపటానికి లేక వ్యతిరేకించటానికి అతడి బలహీనమైన శక్తిసామర్థ్యాలు సరిపోవు. అటువంటి పరిస్థితులలో కుటుంబ సంప్రదాయం లోని భాగమే పిల్లవాడు అనుసరించే మతం. కాబట్టి కొంత వయస్సు (దాదాపుగా యుక్త వయస్కుడయ్యే వరకు) వచ్చే వరకు, సృష్టికర్త అతడు అనుసరించిన కలుషిత అసత్యమార్గానికి, అతడినే బాధ్యుడిగా చేసి శిక్షించడు

# 7. సృష్టికర్త సంకేతాలు

బాల్యం నుండి మరణం వరకు సాగే మొత్తం మానవ జీవితంలో ప్రతి మానవుడు 'సత్యమైన ఆరాధ్యుడు ఒక్కడే' అని స్పష్టంగా గ్రహించే వరకు, ప్రపంచంలోని ప్రతి చోట మరియు ప్రతి ఆత్మకు సృష్టికర్త సంకేతములు చూపించబడతాయి. దివ్యఖుర్ఆన్ లో అల్లాహ్ ఈ విధంగా ప్రకటిస్తున్నాడు - త్వరలోనే వారికి మా నిదర్శనాలు (భూమిలోని) సుదూర ప్రాంతాలలోనూ చూపిస్తాం. వారి (దేహనిర్మాణం) లోనూ చూపిస్తాం. చివరికి ఈ ఖుర్ఆన్ నిజంగా సత్యమైన దైవవాణి అనే విషయం వారి ముందు స్పష్టమౌతుంది. ఖుర్ఆన్ 41:53

ఈ క్రింది ఉదాహరణ ద్వారా సృష్టికర్త ఒక వ్యక్తికి ఏ విధంగా విగ్రహారాధన అనే ఘోరమైన పాపం నుండి బయట పడడానికి అవసరమైన, సంకేతాలు చూపిందాడో స్పష్టమవుతుంది. దక్షిణ అమెరికా, బ్రెజిల్ దేశం లోని అమెజాన్ అరణ్యంలో ఆగ్నేయ దిక్కుగా ఉన్న అటవీ ప్రాంతంలో ఒక ఆదిమజాతి నివాసం ఉంటున్నది. వారు సృష్టింతటిలోనూ అత్యంత శ్రేష్టమైన దేవుడిగా స్వ్వాథ్ అనే మగదేవుడిని కొలుస్తున్నారు. క్రొత్తగా ఒక గుడిసె నిర్మించి, ఆ దేవుడి విగ్రహాన్ని అందులో ప్రతిష్ఠించారు. కులపెద్దలు బోధించిన విధంగా తెగవాసులు ఆ విగ్రహానికి

పూజలు చేస్తుండేవారు. వారిలో ఒక యువకునికి భక్తి ఎక్కువగా ఉండేది. ఎప్పటిలాగే అతడు ఒకరోజు దేవుడి గుడిసెలోనికి ప్రవేశించి, ఎదురుగా ఉన్న విగ్రహానికి పూజ చేస్తున్న సమయంలో ఒక విచిత్ర సంఘటన జరిగినది. గజ్జి పట్టి, జోరీగలు చుట్టుముట్టిన ముసలి కుక్క ఒకటి ఆ గుడిసెలోనికి వేగంగా చొరబడినది. ఈ హఠాత్పరిణామం నుండి తేరుకునేలోగా, అది వెనక్కాలెత్తి ఆ దేవుడి విగ్రహం మీద ఉచ్ఛపోయడం మొదలు పెట్టినది.

కుక్క చేసిన ఆ నీచమైన పని అతడికి విపరీతమైన కోపం తెప్పించినది. వెంటనే అతడు ఆ కుక్కను దేవుడి గుడిసెలో నుండి బయటకు తరిమివేసినాడు. కాని తన కోపం తగ్గిన తర్వాత, కుక్క నుండి తనను తాను కాపాడు కోలేని ఆ దేవుడి నిస్సహాయత అతడిలో ఆలోచనలను రేకెత్తించినది. విశ్వప్రభువు వేరే చోట ఉంటాడనే నమ్మకం అతడిలో నాటుకు పోయినది. అన్ని ఆపదల నుండి కాపాడ గల సర్వలోక శక్తిమంతుడని నమ్ముతున్న ఆ దేవుడి విగ్రహం మీద ఒక బలహీనమైన ముసలి కుక్క, అతడి కళ్ళ ముందే ఉచ్ఛపోయగలగటం ద్వారా ఆ విగ్రహం మీదున్న అపోహలు, భ్రమలు తొలగిపోవటానికి అవకాశం కలిగినది. ఇది సర్వలోకసృష్టికర్త నుండి అతడికి చేరిన స్పష్టమైన సంకేతం.

ఇదంతా చూసిన తర్వాత, తను ఇప్పటి వరకు ఆరాధిస్తున్న ఆ దేవుడి విగ్రహం అసత్యమైనదనే వాస్తవాన్ని అతడు తనకు ప్రసాదింపబడిన తెలివితేటల ద్వారా వెంటనే పసిగట్టగలిగితే అతడికి చేరిన ఆ సంకేతాలను సరిగ్గా గ్రహించినవాడవుతాడు. ఆ సంఘటన వంశపారంపర్యంగా వస్తున్న ఆ అసత్యపు దేవుడిని ఆరాధించడమనే క్షుద్రమైన మూఢాచారం నుండి విముక్తి చెందటానికి అవకాశం కలిగించినది. ఫలితంగా అసలైన సృష్టికర్తను కనుక్కునే సత్యాన్వేషణ చేయాలా లేక పాత మూఢత్వ పద్ధతిలోనే ఆ అసత్యపు దేవుడిని ఆరాధించాలా అనే రెండు మార్గాల లో ఏదో ఒకదానిని ఎన్నుకునే అవకాశం సృష్టికర్త నుండి అతడికి ఇవ్వబడినది.

తన సంకేతాలను అనుసరించే వారిని సృష్టికర్త ఏవిధంగా స్వచ్ఛమైన సత్యమార్గం వైపుకు దారి చూపుతాడో దివ్యఖుర్ఆన్ లో స్పష్టంగా ఉదహరించబడినది. వాస్తవమైన సృష్టికర్తను కనుక్కోవాలనే ప్రవక్త ఇబ్రహీం (అల్లాహ్ ఆయనపై శాంతిని కురిపించు గాక) యొక్క తపన అందరికీ కనువిప్పు కలిగించేదిగా ఉన్నది - ఇబ్రహీం నమ్మకవారలో చేరడానికి మేమతనికి ఈ విధంగా భూమ్యాకాశాల సామ్రాజ్య వ్యవస్థను చూపిందాము. ఒకరోజు అతడిపై చీకటి కమ్ముకోగానే అతడొక నక్షత్రం చూసి "ఇతను నా ప్రభువు" అన్నాడు. కాని ఆ నక్షత్రం అస్తమించగానే "ఇలాంటి అస్తమించే వాటిని నేను ప్రేమించను" అన్నాడు.

తర్వాత చంద్రుడు ప్రకాశిస్తూ కనిపించగానే "ఇతడే నా ప్రభువు" అన్నాడు. కాని ఆ చంద్రుడు కూడా (కాస్సేపటికి) అస్తమించడంతో "ఇతడు కూడా నా ప్రభువు కాలేడు. నా ప్రభువు నాకు మార్గం చూపకపోతే నేను మార్గభ్రష్టుణ్ణయి పోతాను" అన్నాడు.

ఆ తర్వాత (మరునాడుదయం) సూర్యుడు దేదీప్యమానంగా వెలిగిపోతూ కన్పించాడు. అప్పుడు ఇబ్రహీం "ఇతనే నా ప్రభువు, అందరికంటే గొప్ప ప్రభువు" అన్నాడు. అయితే సూర్యుడు కూడా అస్తమించిపోవడంతో (అతడికి జ్ఞానోదయం అయింది) అతడు తన జాతి ప్రజల్ని ఉద్దేశించి "నా జాతి సోదరులారా! మీరు దైవానికి సాటికల్పిస్తున్న మిథ్యా దైవాలతో నేను విసిగిపోయాను. నేనిప్పుడు పూర్తి ఏకాగ్రతతో భూమ్యాకాశాల్ని సృష్టించిన వాని వైపు మరలాను.నేను ఏ మాత్రం బహుదైవారాధకుడ్ని కాను" అని అన్నాడు. దివ్యఖుర్ఆన్ 6: 75 - 79

ఇంతకు ముందు పేర్కొన్నట్లుగా, అన్ని జాతుల దగ్గరకు మరియు అన్ని ప్రాంతాలకు ప్రవక్తలు పంపబడ్డారు. వారు మానవుడిలో ప్రకృతి సహజంగా ఉండే దైవవిశ్వాసం మరియు పుట్టుకతో వచ్చే దైవారాధన కోరికను బలపరచటమే కాకుండా సృష్టికర్త ప్రతిరోజు తన జీవితంలో పంపుతున్న సత్యమార్గ సంకేతాలను కనుక్కునే విధానాన్ని కూడా చూపించారు. ఆ దైవప్రవక్తల బోధనలు కాలక్రమంలో అనేక మార్పులు చేర్పులకు గురైనవి. అయినప్పటికీ వాటిలో కొన్ని దైవసందేశాలు మాత్రం

కల్పితాలకు గురికాకుండా రక్షించబడినవి అవి ఇప్పటికి అసలైన మూలరూపంలోనే ఉండి, మానవుడికి స్వచ్ఛమైన సత్యమార్గం లేక కలుషితమైన అసత్యమార్గాలలో సరైనదాన్ని ఎన్నుకునేటట్లు సహాయపడుచున్నవి. అటువంటి కల్తీలేని దైవ ప్రేరేపిత సందేశాల ప్రభావం ఈనాటికీ యూదుల తౌరాత్ అనే దివ్యగ్రంథంలో కొన్ని చోట్ల (పది పాత నిబంధనలు) స్పష్టంగా కనబడుతుంది. వీటిలో కొన్నింటిని క్రైస్తవులు తమ ప్రబోధనలలో ఇముడ్చుకున్నారు.ఇంకా ప్రాచీన/నూతన ప్రపంచం లోని దాదాపుగా అన్ని దేశాలలో,సమాజాలలో హత్య, వ్యభిచారం దొంగతనం, మొదలగు సంఘ వ్యతిరేక శక్తులను శిక్షించటానికి తయారుచేసే న్యాయశాస్త్ర చట్టాలలో కూడా కల్తీలేని దైవ ప్రేరేపిత సందేశాల ప్రభావాన్ని మనం గమనిస్తున్నాం. మానవుల కోసం అన్ని కాలాలలో పంపబడిన దైవవాణి, సృష్టికర్త సంకేతాలు, ప్రవక్తల ద్వారా పంపబడిన సందేశములతో కలిసి మానవజాతికి నిజమైన ఆరాధ్యుడిని గుర్తించే అవకాశం ఎల్లప్పుడూ ఇవ్వబడుతున్నదనే విషయం స్పష్టమవుతున్నది.

పర్యవసానంగా సృష్టికర్త పై పూర్తి విశ్వాసముంచి మరియు స్వచ్ఛమైన, సత్యమైన, నిజమైన దైవధర్మం ఇస్లాంను(పూర్తిగా అల్లాహ్ అభీష్టానికి సమర్పించుకోవటం) స్వీకరించినచో ప్రతి ఆత్మ తన బాధ్యతను విజయవంతంగా పూర్తిచేసుకుని, భూలోక జీవన పరీక్షలో నెగ్గి ఇహపరలోకాలలో సాఫల్యం పొందుతుంది.

# 8. ముగింపు

“సృష్టికర్తకు స్వయంగా, శాంతియుతంగా, పూర్తి విధేయతతో సమర్పించుకోవడమనే మూలసిద్ధాంతాన్ని స్పష్టంగా ప్రకటిస్తున్న ఇస్లాం అనే ధర్మం పేరును మానవుడు ఎన్నుకోలేదు, అది సృష్టికర్తచే స్వయంగా నిర్ణయించబడినది” అనే విషయం ఇస్లాం మూలగ్రంథాలైన దివ్యఖుర్ఆన్ మరియు ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం బోధనలు(హదీథ్) ఆధారంగా ఋజువు అయినది.

ఇంకా ఇస్లాం మాత్రమే సృష్టికర్త యొక్క ఏకైకత్వాన్ని మరియు దాని ప్రత్యేక మహిమలను, విశేష గుణగణాలను సవివరంగా విశదీకరిస్తున్నది. ఇస్లాం మాత్రమే ఎటువంటి మధ్యవర్తులు లేకుండా, సృష్టికర్తనే ఏకంగా ఆరాధించమని ఆజ్ఞాపిస్తున్నది.

చివరిగా మానవుడి మనసులో పొందుపరచిన ఏకైక దేవుడి ఆరాధన వైపు మొగ్గు చూపే దివ్యలక్షణాల వలన మరియు తన సంకేతాలను అర్థం చేసుకునే శక్తిసామర్థ్యాలు సృష్టికర్త అన్ని కాలాలలో ప్రతి ఒక్కరికి ఇవ్వటం వలన, మానవులందరి వద్దకు అన్ని ప్రాంతాలలో, అన్ని కాలాలలో ఇస్లాంధర్మ సందేశం చేరి ఉంటుందని దృఢంగా విశ్వసించవచ్చును.

క్లుప్తంగా, ఇస్లాం (స్వయం దైవసమర్పణ) పేరులోని ప్రత్యేకత, ఇస్లాం ధర్మపు మూలాధారమైన ఏకత్వ దృఢాభిప్రాయం మరియు అన్ని కాలాలలోను మొత్తం మానవజాతికి సులభంగా అందుబాటులో ఉండటం - ఇవన్నీ ఇస్లాం యొక్క దావాను **అంటే మొట్టమొదటి నుండి ఏ భాషలో వెల్లడించబడినా, ఇస్లాం మాత్రమే స్వచ్ఛమైన. సత్యమైన దైవమార్గమనే నిజాన్ని** పూర్తిగా సమర్థిస్తున్నాయి.

చివరిగా, ఏ స్వచ్ఛమైన సత్యమార్గమునైతే అల్లాహ్ మనకు చూపించాడో ఆ మార్గమును మనచే మనస్ఫూర్తిగా అనుసరింప జేయమని, అతని ఆశీర్వాదములు, కరుణ మనందరి మీద కురిపించమని అనంత దయామయుడు మరియు అపార కృపాశీలుడైన అల్లాహ్ ను ప్రార్థిస్తున్నాం. అన్ని రకాల ప్రశంసలు సర్వలోక ప్రభువైన అల్లాహ్ కే చెందును. ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం పై శాంతి మరియు కరుణ కురుపించమని మరియు అల్లాహ్ యొక్క ప్రవక్తలందరిపైనా , వారి సహచరుల పైనా కూడా శాంతి మరియు కరుణ కురిపించమని అల్లాహ్ ను వేడుకుంటున్నాం.